తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం - 04 - అక్టోబర్ - 2026 | సంపుటి : 4 | సంచిక : 121 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# పిల్లల డిజిటల్ భద్రతకు

# సమష్టి కృషి




- న్యాయ సేవల కార్యక్రమాలకు పూర్తి మద్దతు
- పిల్లల రక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):

ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల నుంచి పిల్లలను రక్షించేందుకు న్యాయ సేవల ప్రాధికార సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలపై పిల్లల భద్రతను బలోపేతం చేయడానికి రూపొందిస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు

మిగతా 2 లో..

## 22-ఎ సమస్యల పరిష్కారానికి ముందడుగు

- నాలా పూర్తి కాని భూములకు ఊరట
- రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం.. కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మిగతా 2 లో..

## అంగన్‌వాడీ, ఆశా సిబ్బందికి ఘన సత్కారం

- మహిళా సాధికారతపై కేంద్ర ప్రభుత్వ దృష్టి
- గ్రామీణ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకగా సిబ్బంది: ఈటెల

2 లో..




## ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

- సిబ్బంది నియామకాలకు ముందస్తు చర్యలు
- ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులపై పర్యవేక్షణ
- గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష
- సీఎం రేవంత్ రెడ్డి

2 లో..





## ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్‌కు ప్రజల ఆదరణ

హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):

- ప్రజా రవాణా అనుసంధానంలో కీలక ముందడుగు
- ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకున్న మంత్రులు
- ఒకే పాస్‌తో సులభతర ప్రయాణానికి అవకాశం

హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ మెట్రో రైలు సంయుక్తంగా ప్రవేశపెట్టిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ వినియోగంపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేకంగా ప్రయాణించి సమీక్షించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీ హిల్స్ చెక్‌పోస్ట్ వరకు మెట్రో రైలులో, అక్కడి నుంచి సచివాలయం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి కామన్ పాస్ అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో నేరుగా మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ కామన్ పాస్ వినియోగం, మెట్రో-ఆర్టీసీ అనుసంధానం, ప్రయాణ సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలను స్వీకరించి ప్రజా రవాణా సేవలను మరింత మెరుగుపరిచే అంశాలపై చర్చించారు. ఒకే పాస్‌తో మెట్రో రైలు, ఆర్టీసీ బస్సు సేవలను వినియోగించుకునే అవకాశం కల్పించడం ద్వారా

మిగతా 2 లో..




## దక్షిణాసియా పాలపానీయ సంరక్షణ సదస్సుకు గవర్నర్ హాజరు

హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):

- శిశు పోషణపై సమగ్ర చర్చలు
- హైదరాబాద్‌లో ఆరో దక్షిణాసియా సదస్సు
- ముఖ్య అతిథిగా పాల్గొన్న శివ ప్రతాప్ శుక్లా

తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హైదరాబాద్‌లో నిర్వహించిన ఆరో దక్షిణాసియా పాలపానీయ నిర్వహణ, పాల బ్యాంకుల నిర్వహణ, తల్లిపాల ప్రోత్సాహ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిశు ఆరోగ్యం, తల్లిపాల ప్రాధాన్యత, పాల బ్యాంకుల నిర్వహణ వంటి అంశాలపై నిర్వహించిన ఈ సదస్సులో వైద్య నిపుణులు, ఆరోగ్య రంగ ప్రతినిధులు పాల్గొన్నారు. హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో సుశేన ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. తల్లిపాల ప్రోత్సాహం, శిశు పోషణ, నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన తాజా విధానాలు, పరిశోధనలపై నిపుణులు అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, తల్లిపాలు శిశువుల ఆరోగ్యానికి అత్యంత కీలకమని పేర్కొన్నారు.

మిగతా 2 లో..



## ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత

- ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు కన్నుమూత
- చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో తుదిశ్వాస

8లో..

## నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సదుపాయం

- పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక అవకాశం
- ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదు
- పొంగులేటి ప్రకటనతో యువతలో ఆనందం

2 లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పిల్లల డిజిటల్ భద్రతకు సమష్టి కృషి

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటామని తెలిపారు. పిల్లల రక్షణ, సంక్షేమం విషయంలో ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో "డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం - ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూల న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం" అనే అంశంపై హైదరాబాద్‌లో దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ విక్రమ్ నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.సదస్సులో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలు, పిల్లల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం పలు ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. భరోసా కేంద్రాలు, బాలల సంరక్షణ విభాగాలు, సంక్షేమ కమిటీలు, ప్రత్యేక న్యాయస్థానాలు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు, వైద్య, న్యాయ, మానసిక సలహా సేవలు అందించే భరోసా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. దేశంలోనే తొలి బాలల అనుకూల న్యాయస్థానాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. పిల్లల రక్షణ కోసం మహిళల భద్రత విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సైబర్ ప్రయోగశాలలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులనే సైబర్ అవగాహన దూతలుగా తీర్చిదిద్దుతూ తోటి విద్యార్థులకు భద్రతా సూచనలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

పిల్లల హక్కుల పరిరక్షణలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. పాఠశాల విద్యాశాఖతో న్యాయ సేవల సంస్థలు కలిసి పనిచేస్తున్నాయని, ఉపాధ్యాయుల ద్వారా పిల్లలకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు వేలాది మంది బాలల సంరక్షణ అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించామని వెల్లడించారు. పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అత్యవసర సైబర్ ఫిర్యాదుల కోసం 1930, బాలల సహాయ వాణి కోసం 1098 సంఖ్యలను ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష విధించడం మాత్రమే కాదని, బాధితుడి జీవితాన్ని తిరిగి గాడిలో పెట్టడం, గౌరవాన్ని పునరుద్ధరించడం, ముఖ్యంగా పిల్లల కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయమని పేర్కొన్నారు. న్యాయ సేవల ప్రాధికార సంస్థల కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతుతో నిలుస్తుందని స్పష్టం చేస్తూ, ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను ఈ సందర్భంగా ప్రారంభించారు.

# ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన వైద్య సంస్థల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ నగర్ టిమ్స్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై జూబ్లీహిల్స్ నివాసంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి వివరాలు తెలుసుకున్నారు. నిర్మాణ పనులు పూర్తయ్యే సమయానికి వైద్యులు, ఇతర సిబ్బంది కొరత లేకుండా నియామక ప్రక్రియను ముందుగానే ప్రారంభించాలని సూచించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను సమకూర్చి అన్ని రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శితో పాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రులను విధిగా సందర్శించి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతి వారం సమీక్ష నిర్వహించి పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అవసరమైన చోట పాఠశాలల్లో మరమ్మతు పనులు చేపట్టి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని తెలిపారు. విద్య, వైద్యం రంగాల్లో క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చ జరిగింది. సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లు, అతిథుల ఆహ్వానం, పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాల్లో పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలోనే ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విద్య, వైద్యం, పెట్టుబడుల రంగాల్లో సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# దక్షిణాసియా పాలపానీయ సంరక్షణ సదస్సుకు గవర్నర్ హాజరు

(మొదటి పేజీ తరువాయి)

తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణలో వైద్య సంస్థలు, ఆరోగ్య నిపుణులు చేస్తున్న కృషిని అభినందించారు. శిశు మరణాల తగ్గింపు, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లి పాల పాత్ర విశిష్టమని అన్నారు. సదస్సులో పాల బ్యాంకుల నిర్వహణ, శిశువులకు పోషకాహార భద్రత, ప్రసూతి అనంతర సంరక్షణ, వైద్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై చర్చలు జరిగాయి. వివిధ దేశాల నుంచి వచ్చిన నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు. శిశువుల సమగ్ర అభివృద్ధికి తల్లిపాలను ప్రోత్సహించే కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పలువురు నిపుణులు అభిప్రాయపడ్డారు. ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సదస్సులో వైద్యులు, పరిశోధకులు, ఆరోగ్య రంగ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. తల్లి, శిశు ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

# బతుకమ్మ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

- **ఈనెల 10 నుంచి 18 వరకు ఉత్సవాలు.. సద్దుల బతుకమ్మకు ట్యాంక్‌బండ్ వేదిక**
- **అధికారులకు సి.ఎస్ సంజయ్ జాజు ఆదేశాలు**



**హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పూల పండుగను ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపడుతోంది. బతుకమ్మ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల కార్యదర్శులు, పోలీసు అధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.సద్దుల బతుకమ్మ సందర్భంగా ఈనెల 18వ తేదీన హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై వేలాది మంది మహిళలతో భారీ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంజయ్ జాజు వెల్లడించారు. సాయంత్రం నాలుగు గంటలకు సచివాలయం ఎదుట ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి మహిళలు బతుకమ్మలతో భారీ ఊరేగింపుగా బయలుదేరి ట్యాంక్‌బండ్‌కు చేరుకుంటారని తెలిపారు. వారితో పాటు వందలాది మంది కళాకారులు తమ సంప్రదాయ కళారూపాలను ప్రదర్శిస్తూ ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులు, ప్రముఖుల సమక్షంలో ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పండుగ శోభను ప్రతిబింబించేలా నగరంలోని ప్రధాన కూడళ్లు, జంక్షన్లు, ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బతుకమ్మల ప్రతిరూపాలను నగరంలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసి పండుగ వాతావరణాన్ని సృష్టించాలని సూచించారు. నగరంలోని వివిధ కాలనీలు, బస్తీలు, వాడల నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు ట్యాంక్‌బండ్‌కు వచ్చే అవకాశమున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు.బతుకమ్మ నిమజ్జనాల కోసం ట్యాంక్‌బండ్ సమీపంలోని బతుకమ్మ ఘాట్‌తో పాటు నెక్లెస్ రోడ్డులో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు జరిగే ఉత్సవాల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపులు, బారికేడింగ్, పారిశుధ్యం, తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ప్రత్యేక లైటింగ్, భద్రతా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు.బతుకమ్మ ఉత్సవాల పది రోజుల కాలంలో రవీంద్ర భారతిలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలు, చారిత్రక ప్రదేశాలు, జిల్లా కేంద్రాల్లో కూడా బతుకమ్మ వేడుకలను నిర్వహించి తెలంగాణ సంస్కృతిని మరింత విస్తృతంగా ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉత్సాహంగా పాల్గొనేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఏడాది బతుకమ్మ ఉత్సవాల కోసం ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నట్లు సంజయ్ జాజు తెలిపారు. బతుకమ్మ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించడంతో పాటు డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాలను కూడా లోగోలో పొందుపరచనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలని ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు.

# అంగన్‌వాడీ, ఆశా సిబ్బందికి ఘన సత్కారం

**మల్లాపూర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజాసేవా ప్రస్థానానికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మల్లాపూర్‌లో అంగన్ మిలన్ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో కలిసి పాల్గొన్నారు. అంగన్‌వాడీ, ఆశా సిబ్బందిని సత్కరించి వారి సేవలను అభినందించారు. కార్యక్రమంలో మాట్లాడిన ఈటెల రాజేందర్, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో వారు అందిస్తున్న సేవలు అమూల్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేయడంలో వీరి పాత్ర కీలకమని అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో గత 25 సంవత్సరాలుగా అనేక సంస్కరణలను అమలు చేశారని ఈటెల రాజేందర్ తెలిపారు. మహిళా సాధికారత, ఆరోగ్య సంరక్షణ, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతే దేశ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో అంగన్‌వాడీ, ఆశా సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని ఆయన వివరించారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలు, పోషకాహార కార్యక్రమాలు, తల్లిశిశు సంరక్షణ చర్యలను ప్రజలకు చేరవేయడంలో వారి కృషి ప్రశంసనీయమని చెప్పారు. సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేర్చే వారధులుగా వారు నిలుస్తున్నారని పేర్కొన్నారు.

దేశ ప్రగతిలో మహిళల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని ఈటెల రాజేందర్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో మహిళలు ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. మహిళలకు గౌరవం, భద్రత, సాధికారత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాలు ప్రజల్లో సేవాభావాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని నాయకులు పేర్కొన్నారు.

# 22-ఎ సమస్యల పరిష్కారానికి ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ భూములుగా నమోదై అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ నాలా ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన పట్టా భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నంబర్ 48062/యూఎల్‌సీ/ఏ1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

నాలా ప్రక్రియ పూర్తి కాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూములుగానే నమోదై ఉన్న అనేక నివాస పట్టా భూములు 22ఎ జాబితాలో ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి తెలిపారు. తమ సొంత భూములను విక్రయించలేక, రుణాలు పొందలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక వేలాది కుటుంబాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టిందన్నారు.

ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా సమగ్రంగా పరిశీలించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అర్హత ఉన్న భూముల విషయంలో నిబంధనల ప్రకారం నాలా రుసుము, ఇతర ప్రభుత్వ రుసుములు వసూలు చేసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు తెలిపారు. పారదర్శకంగా, కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వ్యవస్థను సరళీకృతం చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. అర్హత ఉన్న దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అమలు పురోగతిపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించినట్లు చెప్పారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం గణనీయమైన ఉపశమనం కలిగిస్తుందని, ఏళ్లుగా నిలిచిపోయిన భూ లావాదేవీలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. శనివారం రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో 22ఎ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రజాకోణంలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఆశించిన ఫలితాలు ఇవ్వాలంటే అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

22ఎ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుందని మంత్రి గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్‌కు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. తాజాగా నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యకు పరిష్కారం చూపడం ద్వారా 22ఎ సమస్యల పరిష్కారంలో మరో కీలక ముందడుగు పడిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

# ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్‌కు ప్రజల ఆదరణ

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులకు సమయం, శ్రమ ఆదా అవుతుందని నాయకులు పేర్కొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు సులభంగా చేరుకునే విధంగా ప్రజా రవాణా వ్యవస్థలను అనుసంధానం చేయడం వల్ల ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహించడం, వ్యక్తిగత వాహనాలపై ఆధారాన్ని తగ్గించడం, ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం వంటి లక్ష్యాలతో ఈ కామన్ పాస్‌ను ప్రవేశపెట్టినట్లు వివరించారు. నగరాభివృద్ధికి అనుగుణంగా ఆధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రాధాన్యతగా ఉందన్నారు.

ఆర్టీసీ, మెట్రో సంస్థల సమన్వయంతో రూపొందించిన ఈ పాస్ నగర ప్రజలకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని అందిస్తుందని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసి నగర ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు.

# నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సదుపాయం

**ఖమ్మం, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన శిక్షణకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్లు ప్రకటించారు. ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.40 వేల విలువైన శిక్షణను ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం కోచింగ్, వసతి ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ యువత ప్రతినిధులు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. గ్రామాలు, పట్టణాల్లోనే ఉంటూ నాణ్యమైన శిక్షణ పొందే అవకాశం కల్పించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మంత్రి, ప్రతిభ ఉన్న యువత ఆర్థిక పరిస్థితుల వల్ల వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రముఖ శిక్షణ సంస్థకు చెందిన ఆన్‌లైన్ తరగతులు, నమూనా పరీక్షల సదుపాయాలను పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వేలాది మంది నిరుద్యోగులకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఆన్‌లైన్ శిక్షణలో ఉపనిరీక్షకుడు, కానిస్టేబుల్, గ్రూప్1 ప్రాథమిక పరీక్ష, గ్రూప్2, గ్రూప్3, గ్రూప్ 4, పంచాయతీ కార్యదర్శి, అటవీ బీట్ అధికారి, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన సాధారణ అధ్యయన అంశాలు, సాధన పరీక్షలు అందుబాటులో ఉండనున్నాయి. ఒకసారి నమోదు చేసుకున్న అభ్యర్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఐదు వేలకుపైగా దృశ్య పాఠాలు ఏడాది పాటు అందుబాటులో ఉండేలా డిజిటల్ వేదికను రూపొందిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే ఖమ్మం జిల్లాలో పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపనిరీక్షకుడు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఖమ్మంలో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని నిరుద్యోగ యువత కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# ఎంఈఓ శాంతన్నకు జర్నలిస్టు బండి రాజు శుభాకాంక్షలు

**పెద్దమందడి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల విద్యాధికారిగా నూతన బాధ్యతలు చేపట్టిన శాంతన్నను జర్నలిస్టు బండి రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బండి రాజు మాట్లాడుతూ పెద్దమందడి మండలంలో విద్యారంగ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు, అవసరమైన విద్యా సౌకర్యాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు ఉపాధ్యాయులకు అవసరమైన సహకారం అందిస్తూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచే దిశగా ఎంఈఓ శాంతన్న కృషి చేయాలని కోరారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు,



విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పెద్దమందడి మండల విద్యాభివృద్ధిలో శాంతన్న తనదైన ముద్ర వేయాలని బండి రాజు ఆకాంక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ మండలంలో విద్యారంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

# పీఆర్‌టీయూ టీఎస్ మండల కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- మండల అధ్యక్షుడిగా వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్





**పెద్దమందడి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పీఆర్‌టీయూ టీఎస్ పెద్దమందడి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎ. వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్. గోపాల్, గౌరవ అధ్యక్షుడిగా జె. శివారెడ్డి, ఉపాధ్యక్షుడిగా తిరుమలేష్ చారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో పది మంది సభ్యులతో మండల కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు వారి హక్కులు, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని నాయకులు సూచించారు. మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ ఎన్నికల కార్యక్రమానికి పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎం. బౌద్ధ రెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు రవీందర్ గౌడ్, రాష్ట్ర సంఘం సభ్యులు రాంచంద్రయ్య సాగర్, ప్రసాద్, గోపాల్‌పేట మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, ఘనపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, నీతిన్ తదితరులు హాజరయ్యారు.నూతన కార్యవర్గం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, విద్యారంగ అభివృద్ధికి తోడ్పడాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు.



# నూతన ఎంఈఓ శాంతన్నకు ఘన సన్మానం

**పెద్దమందడి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల నూతన మండల విద్యాశాఖ అధికారిగా (ఎంఈఓ) బాధ్యతలు చేపట్టిన శాంతన్నను వార్డు సభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి ఆత్మీయంగా అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా నూతన ఎంఈఓ శాంతన్న మాట్లాడుతూ.. పెద్దమందడి మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, తల్లిదండ్రుల సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సింగిరెడ్డి అమల, కురుమూర్తి, కొమ్ము బ్రహ్మయ్య, కొమ్ము విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధిగా తౌటి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి

**స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** బీజేవైఎం జనగామ జిల్లా అధికార ప్రతినిధిగా తౌటి రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా బీజేపీ అధ్యక్షులు సౌడ రమేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అల్లబోయిన హరీష్ ఉత్తర్వులు జారీ చేశారు.తనపై నమ్మకంతో జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి రాజేశ్వర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పూర్తి సమయం కేటాయించి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.తన నియామకానికి



సహకరించిన రాష్ట్ర నాయకులు బొజ్జపెల్లి సుభాష్, ఎన్నారై సెల్ కోకన్వీనర్ దాస్యం అభినవ్ భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, మండల అధ్యక్షులు సట్ల వెంకటరమణ గౌడ్, గాజుల సంపత్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# కరీంనగర్‌లో ఆకట్టుకుంటున్న 'ఎకాం' ప్రదర్శన

- మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత
- ప్రత్యేక ఉత్పత్తులతో ఆకట్టుకుంటున్న ప్రదర్శన
- స్థానిక ఉత్పత్తులకు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే గంగుల పిలుపు





**కరీంనగర్, అక్టోబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** మహిళా పారిశ్రామికవేత్తలు స్వయంశక్తితో ఆర్థికంగా ఎదుగుతూ, ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడానికి సమాజం ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు.స్థానిక ఉత్పత్తులకు ప్రజల ఆదరణ పెంచడంతో పాటు మహిళా వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే మైదానంలో 'ఎకాం' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టిమల్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేశారు.ప్రదర్శనలో ముస్కాన్ సేన్, రోజా, విశాల్, వారి మిత్రబృందంతో పాటు పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు స్వయంగా రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. ప్రత్యేకమైన హ్యాండ్‌మేడ్ క్రాఫ్ట్స్, చీరలు, గాజులు, మెహందీ ఉత్పత్తులు, మహిళలకు అవసరమైన పలు రకాల వస్తువులు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. పెద్ద షాపుల్లో అధిక ధరలకు లభించే కొన్ని హ్యాండ్‌మేడ్ ఉత్పత్తులు నేరుగా తయారీదారుల నుంచే అందుబాటులోకి రావడం ఈ ప్రదర్శన ప్రత్యేకతగా నిలుస్తోంది. రానున్న పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని మహిళలు, కుటుంబాలకు అవసరమైన అనేక రకాల ఉత్పత్తులను ఒకే వేదికపై అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్న మహిళలకు 'ఎకాం' మంచి వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రజలు ప్రదర్శనను సందర్శించి మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, సోషల్ మీడియా ద్వారా వారి ఉత్పత్తులను మరింత మందికి పరిచయం చేయాలని కోరారు.శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనకు ప్రజల నుంచి లభించే స్పందన ఆధారంగా భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, మాజీ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, బీఆర్ఎస్ నాయకులు గంగాధర చందు, నారదాసు వసంత రావు, మిడిదొడ్డి నవీన్ కుమార్, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఎండి అఫ్రోజ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- పనస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు

**వనపర్తి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** పట్టభద్రులంతా తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకునేందుకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. వనపర్తి పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులకు ఫారం 18లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 2023 వరకు ఏదైనా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు. నవంబర్ 6 తుది గడువు కావడంతో అర్హులైన ప్రతి ఒక్కరూ వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటో, ఓటర్ ఐడీ జిరాక్స్ తదితర పత్రాలతో ఫారం18 ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని వివరించారు.ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం వంటిదని, విద్యావంతులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకుని, తమ బంధువులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక సభ్యులు ఉప్పరి తిరుమలేష్, బండారు శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# తొలగించిన అర్హుల ఓట్లను పునరుద్ధరించాలి

- ఎమ్మెల్యే మేఘా రెడ్డి

**వనపర్తి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును పరిరక్షించడంలో ఎన్నికల సంఘం పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన అర్హులైన ఓటర్ల పేర్లను పరిశీలించి వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఓటు ప్రతి పౌరుడికి ఉన్న విలువైన హక్కు అని, అర్హులైన ఒక్కరి పేరు కూడా అన్యాయంగా జాబితా నుంచి తొలగిపోకుండా




చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత పాటించాలని, పేరు తొలగించిన వారికి కారణం తెలియజేసి అభ్యంతరం తెలిపే అవకాశం కల్పించాలని అన్నారు.పేదలు, వృద్ధులు, వలస కార్మికులు తదితరులకు ఓటు హక్కు విషయంలో ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా కాకుండా రాజ్యాంగానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై ప్రతిపక్షాలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో ఆయన నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని మేఘారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ, సీపీఎం, ఎంఐఎం, తెలంగాణ జన సమితి నాయకులతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యలపై ఉద్యమబాట

- అక్టోబర్ 6న ఎంఎస్ఎఫ్ మహాసభ

**ఎల్కతుర్తి, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల సమస్యలు, హక్కులు, విద్యారంగానికి సంబంధించిన అంశాలపై చర్చించేందుకు అక్టోబర్ 6న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్న ఎంఎస్ఎఫ్ జాతీయ ప్రతినిధుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు అడ్డూరి అనిల్ మాదిగ ఆదేశాల మేరకు శనివారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 6న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణపై చర్చించారు. ఎంఎస్ఎఫ్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు గొల్లమందల చరణ్ మాదిగ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, హక్కులు, విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించేందుకు నిర్వహిస్తున్న ఈ మహాసభకు ఎల్కతుర్తి మండలం నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాలని కోరారు. అక్టోబర్ 6న మధ్యాహ్నం 2 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలో జరిగే జాతీయ ప్రతినిధుల మహాసభకు మండలంలోని విద్యార్థులు, ఎంఎస్ఎఫ్ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అభివృద్ధి పనులు





- పలు డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పనులకు శంకుస్థాపన

**కరీంనగర్, అక్టోబర్ 3(తెలంగాణ ముచ్చట్లు):** నగర పాలక సంస్థ పరిధిలో పలు డివిజన్లలో వివిధ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపర్చే లక్ష్యంతో రహదారులు, డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.

నగర పాలక సంస్థ 11వ డివిజన్‌లో సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. అలాగే 3వ డివిజన్ మణికేశ్వరి నగర్‌లో మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు.

29వ డివిజన్ కిసాన్ నగర్‌లో యుఐడిఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైన్ పైప్‌లైన్ నిర్మాణ పనులతో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలకు పరిష్కారం చూపేలా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సయ్య, సాదినేని లావణ్య మునిందర్, సోమిడి వేణు ప్రసాద్, కేవీ చంద్ర, గాజా శివరాం, ఎన్నం ప్రకాష్, మున్సిపల్ అధికారులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు ప్రాతినిధ్యం కల్పించాలి

- **కాటేపాగ హుస్సేన్, తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



**వనపర్తి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో రొటేషన్ విధానాన్ని అమలు చేసి మాదిగ, మాదిగ ఉప కులాలకు చెందిన అర్హులైన జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం (టీఎంజేఎఫ్) డిమాండ్ చేసింది.ఈ సందర్భంగా టీఎంజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటేపాగ హుస్సేన్ మాదిగ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో త్వరలో చేపట్టనున్న నూతన నియామకాల్లో జర్నలిస్టు రంగానికి చెందిన అర్హులకు చైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరారు. ఇప్పటివరకు రాజకీయ ప్రాతిపదికన జరిగిన ఎంపికలకు భిన్నంగా రొటేషన్ విధానాన్ని అమలు చేసి వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా మాదిగ, మాదిగ ఉపకులాలకు చెందిన అర్హులైన జర్నలిస్టులకు కమిషన్‌లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఈ డిమాండ్‌ను ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాటేపాగ హుస్సేన్ మాదిగ తెలిపారు.

# దుర్గ నవరాత్రి ఉత్సవాలకు సీపీ గౌస్ అలంకు ఆహ్వానం



- **టవర్ సర్కిల్ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు**
- **సీపీ గౌస్ అలంను కలిసి ఆహ్వానపత్రం అందజేసిన సర్దార్ రవీందర్ సింగ్**

**కరీంనగర్, అక్టోబర్ 3(తెలంగాణ ముచ్చట్లు ):**కరీంనగర్ టవర్ సర్కిల్‌లో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతియేటా నిర్వహించే దుర్గ నవరాత్రి ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పోలీస్ కమిషనర్ గౌస్ అలంను మర్యాదపూర్వకంగా కలిశారు.యూత్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సీపీని కలిసిన సర్దార్ రవీందర్ సింగ్.. దుర్గ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను వివరించి, కార్యక్రమానికి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరుతూ ఆహ్వానపత్రాన్ని అందజేశారు.భక్తిశ్రద్ధలతో నిర్వహించే నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని నిర్వాహకులు కోరారు.

# ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో వెల్టూర్ విద్యార్థుల ప్రతిభ




**పెద్దమందడి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పెద్దమందడి మండలం వెల్టూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ విజయానికి కృషి చేసిన వెల్టూర్ పాఠశాల విద్యార్థులు, ఫిజికల్ డైరెక్టర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.క్రీడల్లో విద్యార్థులు చురుకుగా పాల్గొని ప్రతిభ కనబరిచి మండల జట్టుకు మంచి ఫలితాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఫిజికల్ డైరెక్టర్ చేస్తున్న కృషిని అభినందించారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

# సింగోటం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి కుటుంబం



**వనపర్తి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** శనివారం కృష్ణపక్ష అష్టమి, ఆర్ద్ర నక్షత్రం సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కుటుంబ సమేతంగా సింగోటంలోని స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఎమ్మెల్యే మేఘారెడ్డి సతీమణి శారదారెడ్డి, కుమారుడు నవనీత్‌రెడ్డితో కలిసి ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వేద బ్రాహ్మణులు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలోని అమ్మవారి సన్నిధిలోనూ ప్రత్యేక అర్చనలు జరిపారు. వేద బ్రాహ్మణులు మంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు.స్వామివారి కృపతో వనపర్తి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి ఆకాంక్షించారు.

# రైతుల సమస్యపై ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందన



**పెద్దమందడి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** సాగునీటి ప్రవాహం సన్నగిల్లడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పందించారు. పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి వద్ద బుద్ధారం కాల్వకు రెండో గూనా ఏర్పాటు చేసేందుకు జేసీబీతో పనులు ప్రారంభించారు.బుద్ధారం కాల్వ ద్వారా అల్వాల, మంగంపల్లి, చిన్నమందడి, సోలీపూర్ గ్రామాలకు సాగునీరు అందుతోంది. పామిరెడ్డిపల్లి వద్ద ఒకే గూనా ఉండటంతో నీటి ప్రవాహం మందగించి చెరువులకు నీరు సక్రమంగా చేరడం లేదని అల్వాల గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే సహకారంతో రెండో గూనా ఏర్పాటుకు తవ్వకం పనులు చేపట్టారు.రెండో గూనా ఏర్పాటు పూర్తయితే నీటి ప్రవాహం మెరుగుపడి అల్వాల, చిన్నమందడి తదితర గ్రామాల చెరువులకు నీరు త్వరగా చేరుతుందని రైతులు తెలిపారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేక పంటలకు నీటి కొరత ఏర్పడిన నేపథ్యంలో ఈ చర్యతో పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించినందుకు రైతులు మేఘారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అల్వాల కాంగ్రెస్ నాయకుడు జి. సుదర్శన్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుజాత భీమన్న, చిన్నమందడి సర్పంచ్ స్వరూప, స్వామి, పలువురు రైతులు పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

**వనపర్తి,అక్టోబర్03(తెలంగాణ ముచ్చట్లు):** ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి నార్కట్‌పల్లి కామినేని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు పొందిన సంబు స్వప్నిల్‌ను సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శనివారం వనపర్తిలోని ఆయన స్వగృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత విజయాలు సాధించడం అభినందనీయమన్నారు. వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, భవిష్యత్‌లో స్వప్నిల్ పేదలకు సేవలందించాలని ఆకాంక్షించారు.స్వప్నిల్ తల్లిదండ్రులు భారతి, శ్రీనివాసులు కూడా వైద్య వృత్తిలో కొనసాగుతున్నారని తెలిపారు. అనంతరం కళా వేదిక ప్రతినిధులు స్వప్నిల్‌ను శాలువా, పూలమాల, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో కళా వేదిక ప్రతినిధులు కందూరు



నారాయణరెడ్డి, బైరోజు చంద్రశేఖర్, డా. బండారు శ్రీనివాస్, గంధం నాగరాజు, డా. బి. శ్యాంసుందర్, పెరుమాళ్ల శ్రీనివాస్, వడ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# హిమ్మత్‌నగర్ నుంచి జాతీయ స్థాయికి.. వెడ్డింగ్ ఫోటోగ్రాఫర్ శ్రీనివాస్‌కు అవార్డు



**వీణవంక, అక్టోబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో తన ప్రతిభను చాటుతూ వీణవంక మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన లక్కాకుల శ్రీనివాస్ జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించారు. సిగ్మా అకాడమీ ఆఫ్ ఫోటోగ్రఫీ నిర్వహించిన ప్రతిష్ఠాత్మక ఇండియన్ వెడ్డింగ్ ఫోటోగ్రఫీ కాంటెస్ట్‌లో ఆయన 'సాప్ హెచ్‌ఎం రిబ్బన్' అవార్డుతో పాటు రూ.వెయ్యి నగదు బహుమతిని అందుకున్నారు.

హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాప్ ఫౌండర్ ఎం.సి. శేఖర్ చేతుల మీదుగా శ్రీనివాస్ అవార్డును స్వీకరించారు. గత 16 ఏళ్లుగా వెడ్డింగ్ ఫోటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న ఆయన.. తన సృజనాత్మకత, నైపుణ్యంతో జాతీయ స్థాయి పోటీలో గుర్తింపు పొందడం పట్ల వీణవంక మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ జాతీయ స్థాయిలో పురస్కారం అందుకోవడం మండలానికి గర్వకారణమని వీణవంక మండల ప్రెసిడెంట్ సంగెం మోహన్‌తో పాటు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా లక్కాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తనకు సహకారం అందించిన అవార్డు నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఫోటోగ్రఫీ రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# ఆరోగ్యవంతమైన తరం కోసం పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ

- **అంగన్వాడీ పోషణ మాసం కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దిలీప్**






**జమ్మికుంట, అక్టోబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు బలంగా, ఆరోగ్యవంతంగా ఎదిగి భవిష్యత్ తరానికి బలమైన పునాది ఏర్పడుతుందని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ అన్నారు. శనివారం జమ్మికుంట పట్టణ పరిధిలోని కేవీకేలో నిర్వహించిన అంగన్వాడీ పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. తల్లులు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను నివారించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా పెరిగితే భవిష్యత్తులో వైద్య ఖర్చులు తగ్గడంతో పాటు విద్య, అభివృద్ధి రంగాల్లో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమకు అందాల్సిన ప్రయోజనాల విషయంలో ఎలాంటి సంకోచం లేకుండా అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, సంబంధిత అధికారులు, కౌన్సిలర్లను సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతమైన పిల్లలను తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, ఎంపీడీవో, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటం

- **సీఐటీయూ ఆధ్వర్యంలో జమ్మికుంటలో ప్రదర్శన**

**జమ్మికుంట, అక్టోబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** కార్మిక హక్కుల పరిరక్షణ, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత, పని ప్రదేశాల్లో రక్షణ కల్పించాలనే డిమాండ్లతో సీఐటీయూ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం ప్రదర్శన నిర్వహించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (డబ్ల్యూఎఫ్‌టీయూ) సందర్భంగా ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 81వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను రక్షించడం, వారి సమస్యలను పరిష్కరించడం, శ్రమకు తగిన గౌరవం, న్యాయమైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ఈ హక్కుల అమలు కోసం ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) పనిచేస్తోందని, దానిలో భాగమైన సీఐటీయూ దేశ, రాష్ట్రస్థాయిల్లో కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు.పరిశ్రమల్లో ఉత్పత్తికి కీలకమైన కార్మికుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మికుల భద్రత, హక్కులకు సంబంధించిన చట్టాల అమలులో నిర్లక్ష్యం జరుగుతోందని ఆరోపించారు.కార్మిక వర్గం



ఐక్యంగా ఉండి తమ హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ జక్కుల రమేష్, జిల్లా కమిటీ సభ్యురాలు గేర రాజకుమారి, సాగర్ల కుమార్, మండల కమిటీ సభ్యులు మధునయ్య, పోచయ్య, కిరణ్, నాగరాజు, నరేష్, సంతు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## మహానంది జాతీయ పురస్కార గ్రహీత ఊకంటి మహేందర్‌కు ఘన సన్మానం



**జమ్మికుంట, అక్టోబర్ 03 (తెలంగాణ ముచ్చట్లు):** ఉద్యోగ రంగంలో అంకితభావంతో సేవలందిస్తూ, సహచర ఉద్యోగులకు మార్గదర్శకంగా నిలుస్తున్న జమ్మికుంట పోస్ట్‌మాస్టర్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఊకంటి మహేందర్‌కు ప్రతిష్ఠాత్మక మహానంది జాతీయ పురస్కారం లభించడం పట్టణానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం జమ్మికుంట స్థానిక పోస్టాఫీస్ కార్యాలయంలో పాత్రికేయులు మంద జగన్ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.
శ్రీ విరాట్ విశ్వకర్మ విజ్ఞాన ఆధ్యాత్మిక ధార్మిక కళాపరిషత్ జాతీయ సాహితీ, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి అందించిన తెలుగు వెలుగు సాహితీ వేదిక మహానంది జాతీయ పురస్కారానికి ఊకంటి మహేందర్ ఎంపికయ్యారు. ఉద్యోగ సేవా రంగంలో ఆయన కనబరిచిన అంకితభావం, సేవా దృక్పథం, సహచర ఉద్యోగులకు అందిస్తున్న మార్గదర్శకత్వాన్ని గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మంద జగన్ మాట్లాడుతూ.. ఊకంటి మహేందర్‌కు జాతీయ స్థాయి పురస్కారం లభించడం జమ్మికుంట పట్టణానికి గర్వకారణమన్నారు. ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ సహచరులకు మార్గనిర్దేశం చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవడంతో పాటు ఉద్యోగ రంగంలో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబాల రాజు, పల్లవి రికార్డింగ్ స్టూడియో అధినేత మరముల్ల ప్రభు, జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ సందాని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కమిషన్‌లో మాదిగ జర్నలిస్టులకు అవకాశం కల్పించాలి

- సందెల రాజు
- తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం హన్మకొండ జిల్లా ఇంచార్జి



**హన్మకొండ, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఎస్సీ కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకాల్లో రొటేషన్ పద్ధతిని అమలు చేసి, మాదిగలతో పాటు ఎస్సీ ఉపకులాలకు చెందిన అర్హులైన జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం హన్మకొండ జిల్లా ఇంచార్జి సందెల రాజు కోరారు. ఎస్సీ వర్గాల సమస్యలను సమర్థవంతంగా ప్రజల దృష్టికి తీసుకెళ్తున్న జర్నలిస్టులకు ఎస్సీ కమిషన్‌లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా ఆయా వర్గాల సమస్యలపై మరింత అవగాహన, చర్చకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ఎస్సీ కమిషన్ నియామకాల్లో ప్రభుత్వం సామాజిక న్యాయం, సముచిత ప్రాతినిధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సందెల రాజు విజ్ఞప్తి చేశారు. మాదిగలతో పాటు ఎస్సీ ఉపకులాలకు చెందిన అర్హత, అనుభవం కలిగిన జర్నలిస్టులను కమిషన్‌లో భాగస్వాములను చేయాలని ఆయన కోరారు.

## మాజీ సర్పంచ్ సురవరం వేమారెడ్డి మృతి

- కాంగ్రెస్ సీనియర్ నేతను కోల్పోయిన ఎల్కతుర్తి



**ఎల్కతుర్తి, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సురవరం వేమారెడ్డి (82) శనివారం హనుమకొండలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతితో ఎల్కతుర్తి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.
సురవరం వేమారెడ్డి స్వాతంత్ర్య సమరయోధుడిగా, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా గ్రామ ప్రజలకు సుపరిచితులు. కాంగ్రెస్ పార్టీకి ఆదరణ తక్కువగా ఉన్న సమయంలోనే పార్టీ సభ్యత్వం స్వీకరించి, పార్టీ అభ్యున్నతికి కృషి చేశారు. అనంతరం ఎల్కతుర్తి గ్రామ సర్పంచ్‌గా ఐదేళ్లపాటు పనిచేసి, ప్రజలకు అందుబాటులో ఉంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు.
ప్రజలతో మమేకమై గ్రామ సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేసిన నాయకుడిగా వేమారెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, ఎల్కతుర్తి గ్రామానికి తీరని లోటని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.
వేమారెడ్డి కాంగ్రెస్ పార్టీకి అందించిన సేవలు, ప్రజల కోసం చేసిన కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతాయని వారు అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు ఈ కష్టకాలాన్ని తట్టుకునే శక్తి, మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రార్థించారు.

# మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- మాదిగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా బైగళ్ల వీరబాబు



**మహబూబాబాద్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** చేవెళ్ల డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన అంబేద్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం విషయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయించి, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఆ దిశగా ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసే వరకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వారి పక్షాన నిలబడి పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం మాదిగ హక్కుల పరిరక్షణ సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బైగళ్ల వీరబాబును నియమించారు. ఈ కార్యక్రమంలో మందుల సంతోష్, మందుల శ్రీనివాస్, మందుల శ్రీను, సంతోష్ పాల్గొన్నారు.

# పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గాదె పృథ్వీ



**స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు గాదె పృథ్వీ కోరారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో జనసైనికులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల పార్టీ కోఆర్డినేటర్లు మండపాక కావ్య, బెక్కం జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనసేన పార్టీ అభ్యర్థి గడల శ్రీనివాస్‌రావును పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. గ్రామస్థాయిలో ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేసేలా జనసైనికులు కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు ఎన్నికల కమిటీని ప్రకటించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆశయ సాధనకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం దిశగా పార్టీ శ్రేణులు సమష్టిగా ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఆమంచ సునీల్, మహమ్మద్ రజాక్, కొలిపాక వంశీ, అక్కెనపల్లి సాయి, కనకం రంజిత్, ప్రశాంత్‌రెడ్డి, మహమ్మద్ ఫరీద్, మధుకర్, గొట్టిముక్కల రాజకుమార్, శ్రీకాంత్, సాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ ముందే రోడ్డు క్లియర్

- వేలాడుతున్న చెట్ల కొమ్మలు, ముళ్లపొదల తొలగింపు
- జేసీబీతో పనులు చేపట్టిన కౌన్సిలర్ రమ్య రఘురెడ్డి



**స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** బతుకమ్మ పండుగ నేపథ్యంలో స్టేషన్ ఘనపూర్ 5వ వార్డులో రహదారి రూపురేఖలు మారిపోయాయి. ఏళ్లుగా రైల్వే స్టేషన్ నుంచి మార్కెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు, వేలాడుతున్న చెట్ల కొమ్మలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో 5వ వార్డు కౌన్సిలర్ చల్లా రమ్య రఘురెడ్డి స్వయంగా రంగంలోకి దిగారు. శనివారం జేసీబీ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, రహదారికి అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి రహదారిని శుభ్రం చేయించారు.
బతుకమ్మ పండుగకు వచ్చే ఆడబిడ్డలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఈ పనులు చేపట్టినట్లు కౌన్సిలర్ రమ్య రఘురెడ్డి తెలిపారు. రహదారి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.

# రెడ్డి జాగృతి మండల అధ్యక్షురాలిగా మంతెన సునీతారెడ్డి

- ఏకగ్రీవంగా ఎన్నిక.. శుభాకాంక్షలు వెల్లువ



**స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** రెడ్డి జాగృతి స్టేషన్ ఘనపూర్ మండల అధ్యక్షురాలిగా తానేదార్పల్లి గ్రామానికి చెందిన మంతెన సునీతారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టెంగారి మాధవరెడ్డి, జాతీయ అధ్యక్షులు ఎడ్లే ఉప్పల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షురాలు పోరెడ్డి కవితారెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షులు కర్రెడ్డి రఘునందన్‌రెడ్డి, వ్యవస్థాపక సభ్యులు నీరుడు దయాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు సునీతారెడ్డిని మండల అధ్యక్షురాలిగా నియమించినట్లు తెలిపారు.
'రెడ్డి బలం.. రెడ్డి ఐక్యం.. మన గౌరవం' అనే నినాదంతో రెడ్డి జాగృతి సంస్థ రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారిని ఏకం చేస్తూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సమాజ సేవలో చురుగ్గా పాల్గొంటున్న సునీతారెడ్డికి మండల బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.
నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షురాలు మంతెన సునీతారెడ్డికి రెడ్డి జాగృతి నాయకులు, మండలంలోని రెడ్డి బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

# చలో వరంగల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- బహుజన్ సమాజ్ పార్టీ నాయకుల పిలుపు



**హుజురాబాద్, అక్టోబర్ (తెలంగాణ ముచ్చట్లు ):** బహుజన్ సమాజ్ పార్టీ (BSP) వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షీరాం 20వ వర్ధంతిని పురస్కరించుకుని అక్టోబర్ 20న వరంగల్‌లో నిర్వహించనున్న "చలో వరంగల్ -బహుజన్ రాజ్యాధికార సమరభేరి" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని BSP హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు గిన్నారపు మహేందర్ పిలుపునిచ్చారు. హుజురాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ పల్లి ప్రశాంత్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బహుజన సమాజానికి రాజకీయ సాధికారత కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
బహుజనులకు రాజ్యాధికారం దక్కేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలు మరియు బహుజన హక్కులపై అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తూ బహుజనుల హక్కుల కోసం పోరాడాలని సూచించారు. వరంగల్‌లో నిర్వహించనున్న "సమరభేరి" సభకు పెద్ద సంఖ్యలో బహుజనులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో BSP జిల్లా ఉపాధ్యక్షుడు మండె సమ్మయ్య, నియోజకవర్గ ఇన్‌చార్జులు అంజాల ప్రభాకర్, వేయిల మల్లేష్, నాయకులు కండె తిరుపతి, రాంరాజేశ్వర్, రామ్ శ్రీనివాస్, ఎడునూరి రమేష్, అచ్చుత్, తునికి భాస్కర్, శ్రీకాంత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## సోదరి జ్ఞాపకార్థం స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

- మానవత్వం చాటిన టీచర్ నీలిమ



**చిల్పూర్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మృతి చెందిన చెల్లెలి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం చేపట్టి ఓ ఉపాధ్యాయురాలు మానవత్వాన్ని చాటుకున్నారు. చిల్పూర్ మండలం పల్లగుట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పల్లగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు నీలిమ తన చెల్లెలు కీ.శే. శారా సునందిని (ఏఈఈ, ఎన్‌పీడీసీఎల్) జ్ఞాపకార్థం పాఠశాలలో నూతనంగా చేరిన 62 మంది విద్యార్థులకు రూ.20 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫామ్‌లను అందజేశారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎల్లంభట్ల విజయకుమార్, చిల్పూర్ గుట్ట ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్, సర్పంచ్ ఎనగందుల నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ, నాయకులు చిర్రా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సహాయం చేయడం అభినందనీయమని, సోదరి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమం నిర్వహించిన ఉపాధ్యాయురాలు నీలిమను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమలి, శ్యాంసుందర్‌రావు, అరుణాదేవి, లక్ష్మి, రమేష్, సురేష్, యాకుబ్ పాషా, దేవ్ సింగ్ రాథోడ్, శ్రీకాంత్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

# తాటికొండలో పోషణ్ మాస్ సందడి



- గర్భిణీలకు సామూహిక శ్రీమంతం

**స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** స్టేషన్ ఘనపూర్ మండలం లోని తాటికొండ గ్రామంలో పోషణ్ మాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోషకాహార లోపాన్ని నివారించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని ఏసీడీపీఓ శోభారాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారంతో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సామూహిక శ్రీమంతం నిర్వహించారు. పోషకాహార ప్రాధాన్యతను వివరించేందుకు వివిధ రకాల పోషకాహార వంటకాల ప్రదర్శన చేపట్టారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుజనా శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్లు పద్మ, ధనలక్ష్మి, సులోచన, లలిత, అరుణాదేవి, ఏఎన్ఎం నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిపై సోలార్‌తో.. కరెంట్ బిల్లుకు బైబై



- 3 కిలోవాట్లకు రూ.78 వేల సబ్సిడీ.. 7 శాతం వడ్డీకే బ్యాంకు రుణం

**ఘనపూర్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకంతో విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని ఎన్పీడీసీఎల్ స్టేషన్ ఘనపూర్ విద్యుత్ డీఈ బి.సారయ్య అన్నారు. స్టేషన్ ఘనపూర్ సబ్ డివిజన్ కార్యాలయంలో మూడు రోజులుగా నిర్వహించిన సేవాసేతు అవగాహన కార్యక్రమం శనివారం ముగిసింది.ఈ సందర్భంగా డీఈ సారయ్య మాట్లాడుతూ.. రూ.1.45 లక్షల విలువైన 3 కిలోవాట్ల సోలార్ సిస్టమ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.78 వేల వరకు సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. మిగిలిన మొత్తానికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణ సదుపాయం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకానికి దేశవ్యాప్తంగా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. నెలకు సుమారు రూ.3 వేల విద్యుత్ బిల్లు చెల్లించే వినియోగదారులకు సోలార్ సిస్టమ్ ఏర్పాటు ద్వారా సుమారు మూడేళ్లలో పెట్టుబడి తిరిగి వచ్చే అవకాశం ఉంటుందని సారయ్య వివరించారు. మూడు రోజుల అవగాహన కార్యక్రమం ద్వారా సుమారు 200 మంది వినియోగదారులకు సోలార్ విద్యుత్ ప్రయోజనాలు, పథకం వివరాలపై అవగాహన కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏడీఈ పి.రణధీర్‌రెడ్డి, బి.శ్రీధర్, ఏఏఓ యాకూబ్ పాషా, ఏఈలు శంకర్, శ్వేత, సురేష్, శివకుమార్, రవీందర్, రాకేష్, కరుణాకర్, సబ్ ఇంజనీర్లు మన్విత, హరిత, సాధన, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నీలం ఐలేష్, టీఆర్‌కేవీఎస్ జిల్లా నాయకులు అల్వాల మహేందర్‌రెడ్డి, జేఏవో నాగేందర్, ఎల్ఐ యాదగిరి, లైన్‌మెన్లు శ్రీధర్, సందీప్, అన్వర్ పాషా, అశోక్, విద్యుత్ ఉద్యోగులు, పాలకుర్తి, ఘనపూర్ వినియోగదారులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలి

- లేబర్ కార్డుదారులకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలి
- ఈఎస్ఐ ఆస్పత్రి సౌకర్యం కల్పించాలి
- బీఎన్ఆర్‌కేఏఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి



**హైదరాబాద్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని బీఎన్ఆర్‌కేఏఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆయన విజ్ఞప్తి చేశారు.లేబర్ కార్డు కలిగిన ప్రతి కార్మికుడికి సంవత్సరానికి ఒకసారి ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం కల్పించిన సదుపాయాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని నల్ల స్వామి ఆరోపించారు. గ్రామాల్లో కార్మికుల అవసరం లేకున్నా రక్త నమూనాలు సేకరిస్తూ, సరైన చిరునామా, ఓపీ చీటీ, వైద్యులు, అర్హత కలిగిన సిబ్బంది లేకుండా సేవలు అందిస్తున్నారంటూ ఆయన విమర్శించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.
అర్హులైన ప్రతి కార్మికుడికి 55 ఏళ్లు నిండిన అనంతరం నెలకు రూ.5 వేల పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ఉమ్మడి జిల్లాకు ఒక ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికుడు జీవించి ఉన్నంతకాలం లేబర్ కార్డు చెల్లుబాటయ్యేలా నిబంధనల్లో మార్పులు చేయాలని సూచించారు.ఉపాధి హామీ కూలీలను వెల్ఫేర్ బోర్డు పరిధి నుంచి తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఫైళ్లను వెంటనే పరిష్కరించి సంక్షేమ పథకాల ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌ను కూడా తక్షణమే నియమించాలని నల్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# కోతుల బెడద నుంచి పట్టణ ప్రజలను కాపాడాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేసిన బీసీ జేఏసీ నాయకులు



**హుజురాబాద్,అక్టోబర్ (తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న కోతుల బెడదను అరికట్టి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ బీసీ జేఏసీ నాయకులు మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్‌రావుకు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గ బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షులు సందేల వెంకన్న మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా హుజురాబాద్ పట్టణ ప్రజలు కోతుల బెడద కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇళ్లలోకి కోతులు ప్రవేశించడం, ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, చిన్నారులు, వృద్ధులు, మహిళలను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు పలువురు ప్రాణభయంతో ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.
ప్రజల సమస్యను మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు అత్యవసరంగా పరిగణించి కోతుల నియంత్రణకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు. పట్టణానికి సుదూరంగా ఉన్న ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి అక్కడ పండ్ల మొక్కలు పెంచడంతో పాటు కోతులను పట్టణంలోకి రాకుండా అటవీశాఖ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కోతుల బెడద కారణంగా ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉందని బీసీ జేఏసీ నాయకులు అన్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని, అవసరమైన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరు ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్, బీసీ జాతీయ సంక్షేమ సంఘం హుజురాబాద్ నియోజకవర్గ మహిళా జనరల్ సెక్రటరీ దేవసాని ప్రియదర్శిని, రామ్ సారయ్య, దాట్ల ప్రభాకర్, పోగు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మా భూములు ముట్టుకుంటే ఊరుకోం!

- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌కు భూసేకరణపై భగ్గుమన్న రైతులు
- అధికారులకు వినతిపత్రం






**చిల్పూర్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు తమ భూములను సేకరించవద్దని నష్కల్, వంగలపల్లి గ్రామాల రైతులు స్పష్టం చేశారు. భూసేకరణ ప్రతిపాదనపై శనివారం నష్కల్ గ్రామపంచాయతీకి వచ్చిన ఆర్డీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీప్రియ, ఆర్ఐ లోకేష్‌లను రైతులు నిలదీశారు.
తమ తాత, ముత్తాతల నుంచి వారసత్వంగా వచ్చిన భూములే తమ జీవనాధారమని రైతులు తెలిపారు. తాము చిన్న, సన్నకారు రైతులమని, భూములు కోల్పోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. "మా భూములే మాకు జీవనాధారం.. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇచ్చేది లేదు" అంటూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.
బీజేపీ మండల అధ్యక్షుడు గంటే ఉపేందర్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి శాగంటి మణి ఆధ్వర్యంలో రైతులు నిరసన చేపట్టారు. ప్రభుత్వం భూసేకరణ ప్రతిపాదనపై పునరాలోచించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్లు ఉపేందర్, సత్యనారాయణ, చిల్పూర్ ఆర్ఐ లోకేష్, నష్కల్ జీపీఓ యాకయ్య, రైతులకు సంఘీభావంగా గంటే లక్ష్మి, చిట్యాల రాజేష్ కన్నా, శాగంటి అనిల్, పాశం దాస్, బిక్షపతి, కరుణాకర్, శాగంటి యోబు, పాశం వినోద్, శాగంటి బాబు తదితరులు పాల్గొన్నారు. నష్కల్, వంగలపల్లి గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# నిర్మించారు.. వదిలేశారు!

- అధికారుల నిర్లక్ష్యం.. నిద్రావస్థలో పంచాయతీ
- తానేదార్‌పల్లిలో నిరుపయోగంగా మరుగుదొడ్డి
- నీటి సౌకర్యం లేక ఏళ్లుగా తాళం






**స్టేషన్ ఘనపూర్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** మరుగుదొడ్డి నిర్మించి.. ప్రారంభించడం మరిచిపోయిన ఘటన స్టేషన్ ఘనపూర్ మండలం తానేదార్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ, మహిళా సంఘం భవనం పక్కనే నిర్మించిన మరుగుదొడ్డి కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది.
ప్రజలు, అధికారులు, మహిళా సంఘాల సభ్యుల సౌకర్యం కోసం లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించినప్పటికీ నీటి సౌకర్యం కల్పించకపోవడంతో మరుగుదొడ్డికి తాళం వేసి ఉంచారు. దీంతో పంచాయతీ కార్యాలయానికి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు వాపోతున్నారు.ప్రజా అవసరాల కోసం నిర్మించిన మరుగుదొడ్డి వినియోగంలోకి రాకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టి, నీటి సౌకర్యం కల్పించి మరుగుదొడ్డిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కనుల పండుగగా.. వెంకన్న కల్యాణం

- ఆధ్యాత్మిక శోభతో చిల్పూర్ గుట్ట ఆలయం
- గోవింద నామస్మరణలతో భక్తుల సందడి



**చిల్పూర్,అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన చిల్పూర్ గుట్ట బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం వార కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణ మహోత్సవం కనుల పండుగగా సాగింది.స్వామివారికి, అమ్మవారికి నిర్వహించిన కల్యాణోత్సవాన్ని తిలకించిన భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. "గోవిందా.. గోవిందా" అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో చిల్పూర్ గుట్ట మారుమోగింది. జనగామ, వరంగల్, హైదరాబాద్ ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రాకతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి
కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో లక్ష్మీప్రసన్న, ప్రధాన అర్చకులు రవీందర్ శర్మ, సౌమిత్రి శ్రీరంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# మహిళా అభ్యర్థిపై వ్యాఖ్యలు కలకలం

- ప్రచారంలో వ్యక్తిగత విమర్శలపై దుమారం
- సత్యభామకు అండగా నిలిచిన విజయ్



**ధరాపురం, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** తమిళనాడులో ధరాపురం ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా టీవీకే అభ్యర్థి పి. సత్యభామపై డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. సత్యభామను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల్లో ఆమె శరీరాకృతిని ప్రస్తావించినట్లు ఆరోపణలు రావడంతో టీవీకే నాయకులు, పలువురు నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం ఎన్నికల ప్రచారంలో వ్యక్తిగత విమర్శలు, మహిళల గౌరవం వంటి అంశాలపై పెద్ద చర్చకు కారణమైంది. ఈ వివాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలు చర్చించాల్సిన సమయంలో మహిళా అభ్యర్థిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం తగదని ఆయన పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండొచ్చని, కానీ మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని స్పష్టం చేశారు. మహిళలపై అవమానకరమైన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని విజయ్ తెలిపారు. సత్యభామకు తాను సంపూర్ణ మద్దతుగా నిలుస్తానని పేర్కొంటూ, రాజకీయ నాయకుడిగానే కాకుండా మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి హానికరమని ఆయన అభిప్రాయపడ్డారు.
ఇదిలా ఉండగా, స్టాలిన్ వ్యాఖ్యలను టీవీకే మహిళా గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మహిళలను అవమానించే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని టీవీకే డిమాండ్ చేసింది. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చ కొనసాగుతోంది. అక్టోబర్ 6న జరగనున్న ధరాపురం ఉపఎన్నికకు ముందు టీవీకే, డీఎంకే మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది. ఒకవైపు పాలన, ప్రజా సమస్యలపై విమర్శలు కొనసాగుతుండగా, మరోవైపు వ్యక్తిగత వ్యాఖ్యల వివాదం ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## జీవరాశుల రక్షణే మానవత్వానికి నిజమైన కొలమానం



- **జంతువుల పట్ల కరుణ, సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**
- **ప్రకృతి సమతుల్యతలో జీవరాశుల పాత్ర అపారం**

**డెస్క్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచ జంతు సంక్షేమ దినాన్ని ప్రతి సంవత్సరం అక్టోబర్ 4న ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. జంతువుల హక్కులు, సంక్షేమం, సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడం ఈ దినోత్సవం ప్రధాన ఉద్దేశ్యం. భూమిపై మనిషితో పాటు నివసిస్తున్న ప్రతి జీవికి జీవించే హక్కు ఉందనే విషయాన్ని గుర్తు చేసే సందర్భంగా ఈ రోజును భావిస్తారు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని ఆక్రమిస్తున్న మనిషి, తనతో పాటు ఇతర జీవరాశుల మనుగడకు కూడా బాధ్యత వహించాల్సిన అవసరాన్ని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. ప్రపంచంలో లక్షలాది జంతు జాతులు ప్రకృతి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అడవుల్లో సంచరించే జంతువుల నుంచి గ్రామాల్లో కనిపించే పక్షుల వరకు ప్రతి జీవి పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో భాగస్వామి అవుతుంది. ఒక జీవరాశి అంతరించిపోతే దాని ప్రభావం మొత్తం ప్రకృతి వ్యవస్థపై పడుతుంది. అందుకే జంతువుల సంరక్షణ అనేది కేవలం వాటి రక్షణ మాత్రమే కాకుండా భూమిపై జీవన వ్యవస్థను కాపాడే చర్యగా కూడా పరిగణించాలి. అడవుల నరికివేత, పారిశ్రామిక విస్తరణ, పట్టణీకరణ కారణంగా అనేక జంతువులు తమ సహజ నివాసాలను కోల్పోతున్నాయి. ఒకప్పుడు విస్తారంగా కనిపించిన కొన్ని జాతులు నేడు అరుదుగా మారిపోయాయి. నివాస ప్రాంతాలు తగ్గిపోవడంతో ఆహారం, నీటి కోసం జంతువులు మానవ నివాస ప్రాంతాల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో మానవజంతు ఘర్షణలు పెరుగుతున్నాయి. ఈ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం ప్రకృతి వనరులను సంరక్షించడం ద్వారానే సాధ్యమవుతుంది. వన్యప్రాణుల అక్రమ వేట ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తున్న అంశంగా ఉంది. దంతాలు, చర్మాలు, కొమ్ములు, ఇతర అవయవాల కోసం జంతువులను చంపడం వల్ల అనేక జాతులు అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయి. చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ అక్రమ రవాణా పూర్తిగా ఆగలేదు. వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అత్యంత అవసరం. సమాచారం అందించడం, అవగాహన పెంచడం ద్వారా ఈ దుష్ప్రవర్తనను అరికట్టవచ్చు.

పెంపుడు జంతువుల సంక్షేమం కూడా సమాజంలో ముఖ్యమైన అంశంగా మారుతోంది. కుక్కలు, పిల్లులు, పక్షులు వంటి జంతువులను పెంచుకునే వారు వాటికి సరైన ఆహారం, వైద్య సేవలు, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి. కొందరు వినోదం కోసం జంతువులను పెంచుకుని తరువాత వాటిని నిర్లక్ష్యం చేస్తున్న ఘటనలు కూడా కనిపిస్తున్నాయి. జంతువులను వస్తువులుగా కాకుండా జీవులుగా గుర్తించి ప్రేమతో చూసుకోవాల్సిన అవసరం ఉంది. నగరాల్లో వీధి జంతువుల సమస్య కూడా పెరుగుతోంది. ఆహారం, ఆశ్రయం లేక అనేక జంతువులు రోడ్లపై జీవిస్తున్నాయి. వాహన ప్రమాదాలు, వ్యాధులు, ఆకలి కారణంగా అవి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి వీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ మరింత విస్తృత స్థాయిలో కార్యక్రమాలు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వాతావరణ మార్పులు కూడా జంతు ప్రపంచంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉష్ణోగ్రతల పెరుగుదల, వర్షపాతం విధానాల్లో మార్పులు, అడవి మంటలు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు అనేక జీవరాశుల మనుగడను ప్రమాదంలోకి నెడుతున్నాయి. కొన్ని జాతులు తమ నివాస ప్రాంతాలను మార్చుకోవాల్సి వస్తుండగా మరికొన్ని జాతులు క్రమంగా అంతరించిపోతున్నాయి. ప్రకృతి పరిరక్షణకు తీసుకునే ప్రతి చర్య జంతువుల రక్షణకు కూడా తోడ్పడుతుంది. పిల్లల్లో చిన్నప్పటి నుంచే జంతువుల పట్ల ప్రేమ, కరుణ, బాధ్యతాభావాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉంది. విద్యాసంస్థలు, కుటుంబాలు ఈ విషయంలో కీలక పాత్ర పోషించగలవు. జంతువులపై హింస చేయడం తప్పు అనే అవగాహనతో పాటు వాటి అవసరాలను అర్థం చేసుకునే సంస్కారం పెంపొందితే భవిష్యత్ తరాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించే అవకాశం ఉంటుంది.

# హోటళ్లలో వరుస మరణాల కలకలం

- **షారోన్ నిఖిత కేసులో హత్య ఆరోపణలు**
- **శిరీష మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం**
- **సృజన కేసుతో భద్రతపై ప్రశ్నలు**



**డెస్క్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ నగరంలోని వివిధ హోటళ్లలో యువతులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనలు వరుసగా వెలుగుచూడడం తీవ్ర కలకలం రేపుతోంది. సెప్టెంబర్ 21న మాదాపూర్‌లోని ఒక హోటల్‌లో షారోన్ నిఖిత టోప్నో మృతి చెందగా, సెప్టెంబర్ 29న ఎస్ఆర్ నగర్‌లో బి. శిరీష మృతదేహం లభించింది. అక్టోబర్ 2న మియాపూర్‌లో వైద్య విద్యార్థిని కోమటి సృజన మృతి చెందిన ఘటన వెలుగులోకి రావడంతో నగరంలో హోటళ్ల భద్రత, అతిథుల నమోదు విధానాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాదాపూర్ ఘటనలో విశాఖపట్నానికి చెందిన షారోన్ నిఖిత తన స్నేహితుడు శ్రీనివాస రవితేజతో కలిసి హోటల్‌లో బస చేసినట్లు పోలీసులు గుర్తించారు. మరుసటి రోజు ఆమె అపస్మారక స్థితిలో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శరీరంపై గాయాల ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, వాగ్వాదం సమయంలో దాడి చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు.

ఎస్ఆర్ నగర్ ఘటనలో బ్యాంకు ఉద్యోగిని బి. శిరీష హోటల్ గదిలో మృతిగా కనిపించింది. ఆమెతో కలిసి ఉన్న వ్యక్తి తెల్లవారుజామున హోటల్ నుంచి వెళ్లిపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. గదిలోకి వెళ్లిన హోటల్ సిబ్బంది మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాగ్వాదం తర్వాత దాడి జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తూ హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తాజాగా మియాపూర్‌లో వైద్య విద్యార్థిని కోమటి సృజన మృతి చెందడం మరోసారి ఆందోళనకు దారితీసింది. ఆమె తన స్నేహితుడితో కలిసి హోటల్‌లో బస చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఆమె మృతదేహం గదిలో లభించగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఈ మూడు ఘటనల నేపథ్యంలో హోటళ్లలో అతిథుల వివరాల ధ్రువీకరణ, గుర్తింపు పత్రాల పరిశీలన, నిఘా వ్యవస్థల పనితీరు, సీసీ దృశ్యాల పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అనుమానాస్పద కదలికలు గుర్తించినప్పుడు హోటల్ యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తున్నాయా అనే అంశంపై కూడా చర్చ సాగుతోంది. వరుస ఘటనల దృష్ట్యా నగరంలోని హోటళ్లలో భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలుపై ప్రత్యేక తనిఖీలు అవసరమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం ప్రతి ఘటనను విడివిడిగా దర్యాప్తు చేస్తున్నామని, అన్ని కోణాల్లో ఆధారాలు సేకరిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు. హోటళ్లలో జరిగిన ఈ వరుస మరణాల వెనుక పరిస్థితులు ఏమిటన్న దానిపై దర్యాప్తు నివేదికలు వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం

- **నిజానిజాల నిర్ధారణ కాలానుగుణ అవసరం**
- **వేగం పెరిగిన కొద్దీ పెరుగుతున్న అసత్య సమాచారం**
- **సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నిర్ధారణ లేని వార్తలు**



**డెస్క్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** సమాచార విప్లవ యుగంలో సామాజిక మాధ్యమాలు ప్రజల జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. ప్రపంచంలో ఎక్కడ జరిగిన సంఘటన అయినా క్షణాల్లో ప్రజల చేతుల్లోకి చేరుతోంది. ఒకప్పుడు వార్తలు తెలుసుకోవడానికి పత్రికలు, దూరదర్శిని, రేడియో వంటి సాధనాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు మాత్రం ప్రతి వ్యక్తి చేతిలో ఉన్న దూరవాణి పరికరమే సమాచార కేంద్రంగా మారిపోయింది. అయితే సమాచార వేగం పెరిగిన కొద్దీ తప్పుడు ప్రచారం కూడా అదే స్థాయిలో వ్యాప్తి చెందడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారం నిజమే అనే భావన చాలా మందిలో కనిపిస్తోంది. ఒకరు పంపిన సందేశాన్ని దాని మూలం ఏమిటి, నిజానిజాలు ఏమిటి అనే విషయాలను పరిశీలించకుండా మరొకరికి పంపడం సాధారణంగా మారింది. ఈ విధంగా కొన్ని గంటల్లోనే లక్షలాది మందికి అసత్య సమాచారం చేరుతోంది. నిర్ధారణ లేని వార్తలు ప్రజల్లో అయోమయం, భయం, అనుమానాలకు కారణమవుతున్నాయి. కొన్నిసార్లు చిన్న పుకార్లు కూడా పెద్ద సామాజిక సమస్యలకు దారితీసిన ఘటనలు గతంలో ఎన్నో చోటు చేసుకున్నాయి.

తప్పుడు ప్రచారం వల్ల వ్యక్తుల ప్రతిష్ఠ దెబ్బతినే ప్రమాదం కూడా ఉంది. కొందరిపై ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు ప్రచారం చేయడం, పాత చిత్రాలు లేదా దృశ్యాలను కొత్త సంఘటనలతో ముడిపెట్టి వ్యాప్తి చేయడం తరచూ కనిపిస్తోంది. ఒకసారి తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్తే దాన్ని సరిదిద్దడం చాలా కష్టమవుతుంది. నిజం బయటకు వచ్చే సమయానికి ఆ వ్యక్తి లేదా సంస్థకు జరిగే నష్టం చాలా వరకు జరిగిపోయి ఉంటుంది. ఎన్నికలు, ప్రకృతి విపత్తులు, ఆరోగ్య అత్యవసర పరిస్థితులు వంటి సందర్భాల్లో తప్పుడు ప్రచారం మరింత ప్రమాదకరంగా మారుతుంది. నిర్ధారణ లేని సమాచారం ప్రజలను తప్పుదోవ పట్టించడమే కాకుండా నిర్ణయాలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అసత్య సమాచారం వ్యాప్తి చెందితే ప్రజల్లో భయాందోళనలు పెరిగే ప్రమాదం ఉంది. అందుకే అధికారిక వనరుల నుంచి వచ్చే సమాచారానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ తప్పుడు సమాచార రూపాలు కూడా మారుతున్నాయి. చిత్రాలు, దృశ్యాలు, శబ్దాలను మార్పులు చేసి నిజమైనట్లుగా చూపించే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. సాధారణ ప్రజలు వాటిని గుర్తించడం కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో సమాచార అక్షరాస్యత ఎంతో అవసరం. ఒక వార్తను నమ్మే ముందు అది ఎక్కడి నుంచి వచ్చింది, ఇతర విశ్వసనీయ వనరులు ఏమి చెబుతున్నాయి అనే విషయాలను పరిశీలించే అలవాటు పెంపొందించుకోవాలి. యువత సామాజిక మాధ్యమాలను అత్యధికంగా వినియోగిస్తున్న వర్గంగా గుర్తించబడుతోంది. అందువల్ల తప్పుడు ప్రచారం ప్రభావం కూడా వారిపైనే ఎక్కువగా ఉంటుంది. విద్యాసంస్థల్లోనే సమాచార పరిశీలన, నిజానిజాల నిర్ధారణకు సంబంధించిన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఏ సమాచారం వచ్చినా వెంటనే పంచుకోవడం కాకుండా ముందుగా పరిశీలించడం ఒక సామాజిక బాధ్యతగా భావించే సంస్కృతి పెరగాలి.

సామాజిక మాధ్యమ వేదికలను నిర్వహిస్తున్న సంస్థలపై కూడా బాధ్యత ఉంది. తప్పుడు సమాచారాన్ని గుర్తించి అడ్డుకునేందుకు సాంకేతిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా సమతుల్యత పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు, సంస్థలు, పౌర సమాజం కలిసి పనిచేసినప్పుడే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోవచ్చు. వార్తా సంస్థల పాత్ర కూడా ఈ సందర్భంలో కీలకంగా మారుతోంది. నిర్ధారిత సమాచారం మాత్రమే ప్రజలకు అందించడం, పుకార్లను ఖండించడం, వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడం ద్వారా వార్తా మాధ్యమాలు సమాజానికి సేవ చేస్తున్నాయి. వేగం కంటే విశ్వసనీయత ముఖ్యమనే సూత్రాన్ని పాటించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవచ్చు. ప్రతి పౌరుడు కూడా సమాచార వినియోగదారుడిగానే కాకుండా సమాచార ప్రసారకుడిగా మారిన ఈ కాలంలో బాధ్యత మరింత పెరిగింది. ఒక సందేశాన్ని పంపే ముందు అది సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆలోచించాలి. నిర్ధారణ లేని సమాచారాన్ని పంచుకోకపోవడం కూడా ఒక సామాజిక సేవగానే పరిగణించాలి. చిన్న జాగ్రత్తలు పెద్ద నష్టాలను నివారించగలవు. సామాజిక మాధ్యమాలు సమాచార ప్రజాస్వామ్యానికి కొత్త దారులు తెరిచినా తప్పుడు ప్రచారం అనే సవాలును కూడా ముందుకు తెచ్చాయి. ఈ సవాలును అధిగమించాలంటే నిజానిజాల నిర్ధారణను ప్రతి ఒక్కరూ తమ అలవాటుగా మార్చుకోవాలి. సమాచారం అందుకోవడంలో ఎంత వేగం అవసరమో, దాన్ని పరిశీలించడంలో అంతే జాగ్రత్త అవసరం. నిజాన్ని గుర్తించే సామర్థ్యం పెరిగినప్పుడే సమాజం ఆరోగ్యకరమైన సమాచార వ్యవస్థ వైపు ముందుకు సాగగలదు.

# యువతలో తగ్గుతున్న శారీరక శ్రమ

- **ఆరోగ్య భవిష్యత్తుకు పెరుగుతున్న హెచ్చరిక**
- **సౌకర్యాల పెరుగుదలతో కదలికలకు దూరం**



**డెస్క్, అక్టోబర్ 3 (తెలంగాణ ముచ్చట్లు):** ఒకప్పుడు యువత అంటే ఉత్సాహం, చురుకుదనం, శారీరక సామర్థ్యానికి ప్రతీకగా భావించేవారు. పాఠశాలలు, కళాశాలలు, క్రీడా మైదానాలు, గ్రామీణ వాతావరణం యువతను సహజంగానే శారీరక శ్రమ వైపు నడిపించేవి. అయితే కాలక్రమేణా జీవనశైలిలో వచ్చిన మార్పులు యువత దైనందిన జీవితాన్ని పూర్తిగా మార్చేశాయి. నేడు శారీరక శ్రమ తగ్గిపోవడం యువత ఆరోగ్యానికి అతిపెద్ద సవాళ్లలో ఒకటిగా మారింది. సౌకర్యాలు పెరిగిన కొద్దీ కదలికలు తగ్గిపోవడం ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది.

ప్రస్తుతం విద్య, ఉద్యోగాలు, వినోదం అన్నీ ఎక్కువగా తెరల చుట్టూనే తిరుగుతున్నాయి. గంటల తరబడి దూరవాణి పరికరాలు, గణన యంత్రాలు, ఇతర తెరల ముందు కూర్చోవడం యువతలో సాధారణంగా మారింది. చదువుల ఒత్తిడి, ఉద్యోగ బాధ్యతలు, వినోద అలవాట్లు అన్నీ కలిసి శారీరక చలనాన్ని తగ్గిస్తున్నాయి. చిన్న దూరాలకు కూడా వాహనాల వినియోగం పెరగడంతో నడక వంటి సాధారణ అలవాట్లు కూడా క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఫలితంగా శరీరానికి అవసరమైన శ్రమ అందక అనేక ఆరోగ్య సమస్యలకు యువత గురవుతోంది.

శారీరక శ్రమ తగ్గిపోవడం వల్ల ఊబకాయం వేగంగా పెరుగుతున్న ప్రధాన సమస్యగా కనిపిస్తోంది. ఒకప్పుడు మధ్య వయసు వారిలో ఎక్కువగా కనిపించే అధిక బరువు సమస్య ఇప్పుడు యువతలో కూడా సాధారణంగా మారింది. అధిక బరువు కారణంగా మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు తక్కువ వయసులోనే కనిపిస్తున్నాయి. వైద్య నిపుణుల హెచ్చరికల ప్రకారం నిశ్చల జీవనశైలి కొనసాగితే భవిష్యత్తులో మరింత తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపైనా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వ్యాయామం లేకపోవడం, బహిరంగ ప్రదేశాల్లో గడిపే సమయం తగ్గిపోవడం, ప్రకృతికి దూరం కావడం వల్ల ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. శారీరక శ్రమ వల్ల శరీరంలో ఉత్సాహాన్ని పెంచే సహజ రసాయనాలు విడుదల అవుతాయి. అవి మానసిక ప్రశాంతతను కలిగిస్తాయి. అయితే శ్రమ తగ్గిపోవడంతో యువతలో మానసిక ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలు, కళాశాలల్లో క్రీడలకు కేటాయించే సమయం తగ్గిపోవడం కూడా ఒక కారణంగా మారింది. మార్కులు, పరీక్షలు, పోటీ పరీక్షలపై అధిక దృష్టి పెట్టడం వల్ల క్రీడా కార్యక్రమాలు వెనుకబడుతున్నాయి. విద్యార్థులు చదువుల్లో రాణించడమే కాకుండా ఆరోగ్యంగా కూడా ఉండాల్సిన అవసరం ఉంది. శారీరక దృఢత్వం లేకుండా సంపూర్ణ అభివృద్ధి సాధ్యం కాదనే విషయాన్ని విద్యా వ్యవస్థ మరింతగా గుర్తించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు వ్యవసాయ పనులు, నడక, బహిరంగ ఆటలు యువత జీవితంలో భాగంగా ఉండేవి. ఇప్పుడు అక్కడ కూడా పరిస్థితులు మారుతున్నాయి. సాంకేతిక పరికరాల వినియోగం పెరగడం, క్రీడా మైదానాలు తగ్గిపోవడం, ఖాళీ సమయాన్ని తెరల ముందు గడపడం వల్ల గ్రామీణ యువతలో కూడా శారీరక శ్రమ తగ్గుతోంది. ఇది రాబోయే కాలంలో గ్రామీణ ఆరోగ్య పరిస్థితులపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. నేటి యువత రేపటి సమాజాన్ని నిర్మించబోయే శక్తి. అలాంటి యువత ఆరోగ్య సమస్యలతో బాధపడితే అది వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు, సామాజిక సమస్యగా కూడా మారుతుంది. శారీరక శ్రమను జీవితంలో భాగంగా మార్చుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చు. నడక, వ్యాయామం, క్రీడలు, యోగ వంటి అలవాట్లు యువతకు శారీరక, మానసిక బలాన్ని అందిస్తాయి. యువతలో తగ్గుతున్న శారీరక శ్రమ ఒక హెచ్చరిక గంటలా మారింది. దీనిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఆరోగ్య వ్యయాలు పెరగడంతో పాటు సమాజంపై కూడా భారంగా మారే ప్రమాదం ఉంది. సాంకేతిక సౌకర్యాలను ఉపయోగించుకుంటూనే శారీరక చలనానికి ప్రాధాన్యం ఇవ్వడం కాలానుగుణ అవసరంగా మారింది.

